తుడుచుకొని, "చాలాదూరంనుంచి వచ్చారు. కొంచెం కాఫీ చేసియియ్యి తల్లీ, మళ్ళీ రాత్రి ప్యాసెంజరులో వెళ్ళిపోతారు లే..." అని వీధి గదిలోకి వెళ్ళిపోయాడు.

సబ్బూ, తువ్వాలూతీసుకుని సుశీల పెరట్లోకి వెళ్ళి మొహం కడుక్కొని, వంటింట్లోకి వచ్చి కాఫీలు కలిపింది. "వచ్చినవారుఎందరే?" అని రాని నడిగింది. తల్లీ తండ్రీ అబ్బాయి మొత్తం ముగ్గురుట!

పెద్దవాళ్ళకు కాఫీ యిచ్చింది. వాళ్లు నాన్న దగ్గిర కూర్చుని ఏదో మాట్లాడుతున్నారు. పెళ్ళికొడుకు వేరుగా, నడవలో కుర్చీ మీద కూర్చుంటే కాఫీ యిస్తూ అప్రయత్నంగా మొహంలోకి చూసింది. ప్రసాద్! సందేహం లేదు! ఆయనే బ్రతికే ఉన్నారా? తనకంత అదృష్టమా?

"ఎంతలా మారిపోయేవు సుశీ...నీ ఉత్తరం క్షణం ఆలస్యంగా వస్తే నే నేమైపోయి ఉందునో. నీ ఉత్తరం చూసిన తరువాత "నీ యావజ్జీవిత బ్రహ్మచర్యం" కాస్త పరీక్షిద్దామని నాకూ బుద్ధి పుట్టింది. అందుకే నువ్వు బావని సృష్టించినట్టే నేనూ తమ్ముణ్ణి సృష్టించి కథ నడిపేను. కాని ఎంతయినా పురుషుణ్ణి! నువ్వే మైపోతావోనని ఆత్రేప్ రోజులు ఆగలేక పోయాను సుశీ! ఇక్కడ సంబంధం ఉందని మావాళ్ళని తీసుకొచ్చేను!"

హటాత్తుగా సంభవించిన యీ ఆనందంలో ఆశ్చర్యంలో సుశీల మాట్లాడలేక పోయింది. పరుగుపరుగున వీధి గదిలోకి వెళ్ళి చిన్న పిల్లలా నాన్న మెడచుట్టూ చేతులువేసి "నువ్వు తెచ్చిన సంబంధం నాకు నచ్చింది నాన్నా!" అంది. ఆ తండ్రి హృదయం పొంగిపోయింది.

వ్యక్తులు: ప్రకృతులు

# గట్లు తెగని నీటిగమనం

ఈ. ఈశ్వర్

ఆ విషయంలోనే తెగదు ఎన్నిసార్లు వాదించుకున్నా, వీళ్ళిద్దరికీ. పోనీ అనుకుని వాదనేనా మానుకుంటారాఅనుకుంటే అదీచెయ్యరు. కాని,చందూ కొంచెం నిర్లక్ష్యం మనిషి కాబట్టి ఎంత తెగక పోయినా, ఓ సరికి ఆపేసి పడుక్కుందుకేనా పోతాడు. కాని, సుబ్బయ్య మాత్రం మొండి ఘటం. పట్టుమీద పట్టు దట్టిస్తూనే వుంటాడు, కాని మనిషిని కదలనియ్యడు. చందూకి సిగరెట్టు పెట్టి పూర్తయ్యేసరికి మెల్లిగా కదలిక కలుగుతుంది. సుబ్బయ్యగారి పొడుం డబ్బా సారంగం. మూడురోజులకి సరిపడ ముందుగానే దట్టించి మరీ సిద్ధమౌతాడు మా అరుగు మీదకి. మా తాత కట్టించిన, అరుగు సార్థకమయినందుకు నేను సంతోషించినా, ప్రక్క కటకటాల సావిట్లో మంద మారుతం సేవిస్తూ శయనించాలని ఉబలాటపడే నాకు వీళ్లు కొంత చికాకు. కలిగిస్తూనే వుంటారు నిజానికి.

ఇంతకీ చెప్పొచ్చే మాటేమిటంటే, రంజన రావు గురించి వీళ్ళిద్దరూ తెగ గుంజాటన పడి పోతున్నారు. ఇవాళ ఫ్యార్వమేమో. వీళ్ళ హుషారుకి మరింత వెలుగు కలిగింది. చందూ చెప్పేదేమో మూడు ముక్కల్లో సూటిగా చెప్పేస్తాడు. నిజంగా ఆలోచిస్తే వాడితో ఏకీభవిస్తే సరే; లేకపోతే, "అబ్బాయీ! నేను నీతో ఏకీభవించజాలనందుకు చింతిస్తున్నాను" అని చెప్పేసేనా తప్పుకోవాలి. వాడితో వాదించడము అనవసరం. కారణం, వాడంత సూటిగా స్వచ్ఛంగా, ఖచ్చితంగా చెప్పేస్తాడు, చెప్పే మాటేమిటో. వాడు సాధారణంగా అనాలోచితంగానూ అనడు, తీవ్రంగా ఏదీ ఆలోచనా చెయ్యడు. కాని వాడి నమ్మకాలు వాడి

కున్నాయి. అవి ఒకర్ని బాధించవు. సులువుగా వాటిని మార్చుకోడు.

"సుబ్బయ్యగారూ! మీరు క్షమించాలి. రోజులు మారిపోయాయనే విషయం మీరు గ్రహించాలి. ఇప్పటి కాలపు కుర్రాళ్లు ప్రతీదీ గుడ్డిగా చెయ్యమంటే చెయ్యరు. అందులో పెళ్ళిళ్ల విషయంలో మీరు సిద్ధాంతంచేసి గిరి గీస్తే లాభంలేదు," అని చందూ చంద్రోదయం కాగానే చెప్పాడు. సుబ్బయ్యగారు ఒదిలే మనిషి కాదని చెప్పేగా!

"పెళ్ళిళ్లు చేసుకోరు! అడ్డమైన తిరుగుళ్లూ తిరుగుతారు. ఇనుప కచ్చడాలు కట్టుకు కూర్చున్నారా ఏమిటి? మొనగాళ్లు!"

"అక్కడే మీరు దోవ తప్పుతున్నారు" అంటూ అగ్గిపుల్ల వెలిగించాడు చందూ-"పెళ్ళి చేసుకోనని రంజన్ ఎవరితో అన్నాడు? తనకి బుద్ధి కుదిరినప్పుడు, తన తీరుకు నచ్చిన పిల్లను చేసుకుంటానన్నాడు. తనకి కొన్ని నమ్మకాలు, వుద్దేశాలు వున్నాయి. అవి కనీసం తన స్వంత విషయంలోనైనా అమలు పరుచుకుంటే తక్కిన వాళ్ళ కెందుకు కోపం?"

"నీతులు చెప్పినవాళ్లు అలాగే వుండాలి. కాని, ఆ తిరుగుళ్లు, ఆ మజాలు, ఆ షోకులు ఏమిటి? నమ్మకాలుంటే సన్యసించమను. మళ్ళీ యీ సరసాలన్నీ ఏమిటి?"

చందూకి విషయం విడిచిపెట్టి వితండవాదన లోకి దిగేవాడిమీద వేడి బాగా ఎక్కుతుంది "దారి తప్పుద్దయ్యా అంటే మరీ గోతులోకి పోతావేమయ్యా? వాడు ఒకరికి నీతులేమీ చెప్ప లేదే? ఒకర్ని వాడు నిందించనూ లేదు! వాడి బ్రతుకేదో వాడిని బ్రతకనియ్యమంటున్నాడు. మజాగా వున్నాడు అంటే అది వాడి దారి. నిత్య సంతోషం వాడి సిద్ధాంతం. పోనీ వాడు ఇతరుల కేదేనా హానిచేసేడు కనకనా?"

వాదనలో పట్టు తప్పినకొద్దీ, సుబ్బయ్య గారికి పొడుం పట్టు పెద్దదవుతుంది. జుర్రుమని పించి, మరంబిగించి స్థాయి కొంచెం పెంచాడు. "హీనా, ఘోర హీనా! తాగుడు, దొరచుట్టలు, డబ్బాలకి డబ్బాలు సిగరెట్లు వూదడం, దొర సాని పిల్లల్తో క్లబ్బుల్లో పడి వెర్రి గంతు లెయ్య డం-రామరామ-ఆపైన నా నోటితో కూడా అన లేను-ఇదంతా సిద్ధాంతమే కాబోలు! ముమ్మాటికీ హీనే! కుర్రాళ్లందరికీ చెడు ఆకర్షణ కాదూ? సంఘం పాడైపోవడం లేదూ?"

చందూకి చిరునవ్వు వచ్చినా, చిన్నమబ్బు చంద్రుణ్ణి చుంబిస్తూండడంవల్ల, సుబ్బయ్యగారు చూచేలోగానే జారిపోయింది.—"సుబ్బయ్య గారూ! వాడు వేదికలెక్కి బోధిస్తున్నాడు కన కనా, ఇలా చెప్పి అలా చేస్తున్నాడనుకుందుకు. నా ఏడుపేదో నే ఏడుస్తే మీకెందుకంటాడు. నిజమే! వాడు మహాపవిత్రునిలా ప్రవర్తించడం లేదనే అనుకోండి—హుషారుగానే కాలక్షేపం చేస్తున్నాడు. ఎవరికేనా వుపకారమే చేశాడు కాని అపకారం ఎప్పుడూ తలపెట్టలేదు కదా! అడిగినవాడికి "నా బొంది" అని ఎంత కష్ట పడైనా సాయంచేస్తాడు కదా! వీడిని ఇంతగా పొలుస్తున్నారే తరుచు మీరు పొగిడే శివరావు సంగతేమిటి చెప్పండి?"

"ఆ- అలారానీ!" అని పట్టు దొరికిందన్న ట్లుగా పీఠం కుదురుగా సర్దుకుని, "వాడికేం ఒచ్చిందోయ్? మహరాజు బిడ్డడిలాగ వున్నాడు. ఎవర్ని అడిగినా మనిషంటే వాడు, అని అన్న వాళ్లేగా!"

చందూకి ఒళ్లుమండింది. సిగరెట్టు రెట్టదులు పుతూ, ముక్కు నులుపుకుని- "అలాగా అండి! వాడు- నిజమే- బీర్లు తాగడు, గొనుధారిణు లతో గంతులెయ్యడు. కాని చేస్తున్న ఇతర పనులు మీరెప్పుడేనా కాస్త పరీక్షచేశారా?"

సుబ్బయ్య మహాధాటీగా, "ఓ- కావలసి నంత. వాడికి దైవభక్తి ఎంతా! ఎంత సౌజ న్యంగా మాట్లాడుతాడు? పెద్దలన్నా వాళ్ళ పద్ధతులన్నా ఎంత గౌరవం! వాడికేమోయ్! వాడి తరహాయే వేరు."

"అక్కడే ఆగండి బాబయ్యగారూ! తండ్రి చచ్చిపోయాకవాడు అప్పచెల్లెళ్ళ ఆస్తి కాజేస్తే న్యాయమేనా? పెళ్ళాం వాళ్ళ తాలూకు డబ్బు అవుసరమని వాడేసి ఎగనామం పెట్టడం నీతా? వూళ్లో ఎవరికి ఏదైనా వీడికే కావాలిగదా! వీడు అలాగ, వాడు ఇలాగ అని వొంకలు పెట్టడం, ఇక్కడ మాటలక్కడ, అక్కడమాట లిక్కడ అగ్గిపుల్ల లంటిస్తూండడం, యిదేగా వీడి నిత్య కృత్యం. ఆమధ్య ధనుర్మాసంలో విందుల పేరు

చెప్పి వీడు మింగిన డబ్బుసంగ తేమిటంటారు? సత్రవు గుమాస్తాగిరీ లో వీడి దాహానికి ఏమైనా పరిమితి వుందా? ఆఖరికి స్వామి కైంకర్యానికే బొర్రిపెట్టి, దేవునికే పాచిభోజనం, పస్తులు పెట్టాడే! ఇదే కాబోలు సరైన పద్ధతి?" అని గుక్క తిప్పకుండా, సుబ్బయ్యాని వుక్కిరిబిక్కిరిచేసి, మిగిలిన 'ముక్క' అవతల గిరవాటేసి, చందూ నన్ను లేవగొట్టాడు మంచినీళ్ళ సరఫరాకి.

"ఎందుకురా ఈ మిరియాలదండగ? పోయి పడుకోండి బాబయ్యాగారూ" అంటూ విసుక్కుంటూ లేచా అతిథి మర్యాదకి భంగం వస్తుందనే భయంతో. సుబ్బయ్యాగారి యింజనుకి బ్రేకులు త్వరగా పట్టవు —"ఈ కబుర్లకేంలే.కష్టపడ్డాడుకాబట్టి రెండుడబ్బులు మిగిత్తే పెద్ద బ్రహ్మాండం చేస్తావు. ఆడపిల్లలకి ఆస్తెందుకోయ్? ఎవడు చెప్పినమాట? మాలప్రభుత్వం ఒచ్చి ఛండాల శాసనాలన్నీ చేస్తే ఈకుర్రకుంకలంతా వెర్రిగంతు లేస్తారట! శివంగాడు సరిగ్గా చేశాడు. బంగారంలాంటి తమ్ముళ్ళూ, అవతల మొగుళ్ళూ వుంటూంటే ఆస్తెందుకూ వురెట్టుకుందుకి! వాడేం యిదంతా బ్రాందీ బుడ్లకి ఖర్చుచెయ్యాలా? జాగ్రత్తచేసి, వంశం నిలబెట్టాలని చూస్తూంటే."

చందూకి యింత పట్టుదలగా చర్చించడం యిష్టంలేనేలేదు. చంద్రుడు నెత్తిమీద కొస్తున్న కొద్దీ చల్లనిగాలి వాడిని మరింత మందలిస్తోంది. విసుగుపుడితే వికటంగా మారుతుందిగాధోరణి.

"మాల రాజ్యమే కాదు. బ్రాహ్మణ రాజ్యంలోకూడా స్త్రీ ధనం అనేది వుంది. అయితే సుబ్బయ్యాగారూ! ఒకడి జోలికి పోకుండా, ఉపకార బుద్ధే కలిగి, వాడి బ్రతుకు వాడు బ్రతకడం కన్న ప్రతివాడి విషయంలో కలగజేసుకుంటూ, లోపాయికారీగా దొరికినదంతా అంకించుకుంటూ తిరగడమే మంచిదంటారు. ఇదేగా మీ తాత్పర్యం? ఇంక, మనిద్దరం ఏకీభవించ లేమని ఏకీభవించి బిచాణాలు పర్చుకుంటే మంచిది" అని మంగళ వాక్యం కుపక్రమించాడు.

సుబ్బయ్యాగారికి తెర వదలడం ఇంకా ఇష్టం లేదు. "అక్కడే మీ కుర్రాళ్లంటే నాకు మంట. గట్టులేకపోతే బ్రతగ్గలమా?"

చందూ ఖాళీ అయిన సిగరెట్టుపెట్టి వీధిలో పారేస్తూ "నే ననేదీ అదే. గట్లు తెగి నలుగురి మీదా పడనంత కాలం, పరిమితంగా పోయే నీటి గమనం తన మందహాసంలో తనే కులికి సుళ్లు తిరుగుతూంటే ఫరవా ఏమీలేదు. దీని కొకటే పరిష్కారం. ఊళ్లోవాళ్ల సమస్యలన్నీ మనమే త్రవ్వి, వాళ్ళ చిక్కులన్నీ మనమే చర్చించి, చేసేది చిటికంత లేకపోయినా, తొంభై తొమ్మిది ఎక్కడీసి, వాళ్ళని వీధిలోకి లాగి, మనం అల్లరిపడి గుండె బాదుకోవడం ఏనాడుపోతే ఆనాడు మన తెలుగు వాళ్ళకి మోక్షం వుంది." అని తుది పలుకుపలికి, చటుక్కున అగ్గిపెట్టె జేబులో వేసుకుని తెంచేశాడు యీ తెగని సంభాషణని చందూ.

సుబ్బయ్యాగార్ని యింక యింటికి సాగనంపాలి. నే నందుకుని, "అయ్యా! ఈ కుర్రాళ్ళతో ఏమిటి పోనిద్దురూ వీళ్ళు తెల్లవాళ్ళ తర్క గ్రంథాలు చదివాక బుద్ధులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. మీరు చదివిన తర్కశాస్త్రం చదివిన వాళ్ళయితే, మీరు శ్రమపడి వాదించినా అందం చందం. పాపం, పొద్దున్నే మీ కొత్త రైతు దగ్గిరికి మెరకపొలం వ్యవహారం నిమిత్తం వెళ్తామన్నారు కూడా. ఇంక విశ్రమించండి. పొద్దున్నే లేవాలి" అని జోకొట్టా ఆయన వృధ్ధతాన్ని.

చందూమీద తీవ్రత అకస్మాత్తుగా ఆపడం మర్యాదకి భంగమైనా, నా ఆసరా ఆయనకి తగ్గడానికి వీలు ఇచ్చింది. "నువ్వు చెప్పింది నిజమేనోయ్! కుర్రాళ్లు కుర్రాళ్లే. అనుభవం ఏముంది గనక", అంటూ పీల్చిపీల్చిన పావుశేరు నస్యం మా గుమ్మంలో చీదేసి రంగం నుండి దిగాడు సుబ్బయ్యాగారు.

